
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
సోమవారం 11 ఆగస్టు 2025



గ్రామకంఠాల ఆక్రమణ

గ్రామాల్లో నివాసాల కోసం కేటాయించిన భూమియే గ్రామ కంఠం. ఇది ప్రభుత్వ భూమిగా పరిగణించబడుతుంది. ఇక్కడ ప్రజలు ఇళ్లు నిర్మించుకోవచ్చు. అమ్మకాలు, కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్ వంటివి చేయడానికి వీలుండదు. పాణ్యం మండలంలోని సుగాలిమెట్టకు చెందిన కొందరు గ్రామ కంఠాలను ఆక్రమించుకున్నారు. ఒక్కొక్కరు పది నుంచి ఇరవై సెంట్ల వరకు ఆక్రమించి పునాదులు వేసుకున్నారు. ఈ ఆక్రమణలతో గ్రామంలో రాకపోకలకు అంతరాయమేర్పడి ఘర్షణలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించుకోవడానికి సైతం స్థలం లేకుండా ఆక్రమణలు జరిగాయి. ఇంటి స్థలాల మంజూరులో రెవెన్యూ శాఖ నిర్లక్ష్య ధోరణి వహిస్తుండంతో విచ్చలవిడిగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురౌతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు సైతం గ్రామ కంఠాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం గమనార్హం.



పాణ్యం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుగాలిమెట్టలోని గ్రామ కంఠం స్థలాలు విచ్చలవిడిగా ఆక్రమణకు గురౌతున్నా పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు ఆరో పిస్తున్నారు. ఆక్రమణలపై పలుమార్లు ఫిర్యాదుచేసినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుగాలిమెట్టకు చెందిన కొందరు ఈ స్థలాలను ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. ఒక్కొక్కరు పది నుంచి ఇరవై సెంట్ల వరకు ఆక్రమించి పునాదులు వేసుకున్నారు. పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖ అధికారులు ఈనిర్మాణాల పట్ల చోద్యం చూస్తూ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈఆక్రమణలతో గ్రామంలో రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడి ఘర్షణలు తలెత్తుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి మోడల్ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు సరైన మార్గంలేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలో కొందరు అక్రమార్కులు స్థలాలను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ఆక్రమణలతో సరైన ప్రణాళిక లేక రహదారులు, మురుగుకాల్వలు మూసుకుపోతున్నాయి. దీంతో గ్రామంలో పారిశుధ్యం కొరవడింది.

అదనంగా ఇచ్చిన ఆరోపణలు..

2014లో రెవెన్యూ సిబ్బంది చేతివాటంతో అక్రమంగా సుగాలిమెట్టలో ఇంటి స్థలాలకు అనుమతులు ఇచ్చారు. ఇచ్చిన స్థలం మినహాయించి అదనంగా స్థలాలు ఆక్రమించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతర జిల్లావాసులకు ఈగ్రామంలో ఇంటి స్థలాలు మంజూరు చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇవ్వాల్సిన స్థలాలకు బదులు అదనంగా ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ కంఠాలుగా పేర్కొంటున్న ఈ స్థలాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పంచాయతీ అనుమతుల్లేకుండానే నిర్మాణాలు, విద్యుత్తు అనుమతులు పొందుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు సైతం..

ప్రభుత్వ ఉద్యోగులు సైతం గ్రామ కంఠాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. 1545/ఏ1 లోని 22. 785ఎకరాల రెవెన్యూ భూమిలో ఏపీ టూరిజం శాఖకు 2023 జూన్‌లో ఐదెకరాలు కేటాయించారు. ఈ స్థలం అభివృద్ధికి టూరిజం శాఖ డిశంబరు 19న ప్రతిపాదనల నివేదికలు రాష్ట్ర టూరిజం శాఖ కమిషనర్‌కు పంపినట్లు టూరిజం అధికారులు పేర్కొంటున్నారు. ఈభూమి అన్యాక్రాంతమయ్యే పరిస్థితి ఏర్పడినట్లు స్థాని కులు ఆరోపిస్తున్నారు. హైవే నిర్మాణంతో మిగిలిన పాత జాతీయ రహదారిని కొందరు ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్నా హైవే, రెవెన్యూ అధికారులు గానీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంలో పాటు ఆక్రమణదారులపై చర్యలు లేకపోవడంతో అక్రమార్కులకు ఇష్టారాజ్యంగా మారింది. ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించుకోవడానికి సైతం స్థలం లేకుండా ఆక్రమించారు. ఇంటి స్థలాల మంజూరులో రెవెన్యూ శాఖ నిర్లక్ష్య ధోరణి వహిస్తుండంతో విచ్చలవిడిగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురౌతున్నాయి.

పంచాయతీగా ఏర్పాటైన గ్రామానికి..

పాణ్యం మజరాగా కొనసాగుతున్న సుగాలిమెట్టను 2020లో పంచాయతీగా మార్చింది. పంచాయతీగా ఏర్పాటైనా గ్రామానికి హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే అదనుగా కొందరు అక్రమార్కులు ఇష్టానుసారంగా గ్రామకంఠంలో స్థలాలు ఆక్రమించుకుంటున్నారు. దీంతో గ్రామానికి అవసరమైన పంచాయతీ, ఆర్బీకే, హెల్త్ కేంద్రం తదితర కార్యాలయాలు నిర్మించడానికి ఆటంకంగా మారింది. ఒకదశలో ఆక్రమణలపై అధికారులు విచారించే సమయంలో పోలీసులను ఆశ్రయించాల్సి వస్తోందని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు.

- సుగాలిమెట్టలో ఇంటి నిర్మాణాలు
- స్థలాలు ఆక్రమించి పునాదులు
- రహదారులు లేక ఇబ్బందులు
- మూసుకుపోతున్న మురుగు కాలువలు
- ప్రభుత్వ కార్యాలయాల కోసం మిగలని భూములు
- పట్టించుకోని అధికారులు


రాకపోకలకు అంతరాయంగా మారిన అక్రమ కట్టడం



ఇళ్లకు వెళ్లడానికి కూడా దారి లేదు..

సుగాలిమెట్టలో గ్రామకంఠాల స్థలాలు ఆక్రమించి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మాఇళ్లకు వెళ్లడానికి కూడా దారిలేని పరిస్థితి. పలుమార్లు అధికారులకు తెలిపినా ఎటువంటి స్పందన లేదు. ప్రభుత్వం వెంటనే ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలి.

● మంగీబాయి, సుగాలిమెట్ట

రహదారిని మూసివేసి..

ఇల్లులేని వారు ఇంటి స్థలాలకు ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోకపోవడంతో ఆక్రమణలు ఎక్కువయ్యాయి. మా ఇంటి ముందువైపు రహదారిని మూసివేసి ఆక్రమణలు జరిగాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

● భారతీబాయి, సుగాలిమెట్ట



విచారించి చర్యలు చేపడతాం

సుగాలిమెట్టలోని ఆక్రమణలపై విచారణ చేపట్టి చర్యలు చేపడతాం, ఆక్రమణలను తొలగించి అర్హులకు ఇంటి స్థలాలు మంజూరుచేసేలా చర్యలు తీసుకుంటాం. రహదారులను ఆక్రమిస్తే చర్యలు తప్పవు. ప్రభుత్వ అనుమతులు లేని ఇంటి నిర్మాణాలపై చర్యలు చేపడతాం

● నరేంద్రనాథ్ రెడ్డి, తహసీల్దార్, పాణ్యం

ఆఖరికి అవస్థలే..!

- శ్మశానానికి వెళ్లాలంటే నది దాటాల్సిందే
- ఉధృతంగా ప్రవహిస్తున్న వకులా నది
- ఇబ్బందులు పడ్డ మృతుడి బంధువులు


వకులా నదిలో డోలీ మోసుకొని వెళ్తున్న మృతుడి బంధువులు

ఆళ్లగడ్డ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మనిషి రోజురోజుకు ఎంతో అభివృద్ధి చెందుతుందన్నా.. కొన్ని విషయాల్లో నేటికీ వెనుకబడే ఉన్నా డు. ఆఖరి(అంత్యక్రియలు) నిర్వహించాల్సి అవస్థలు తప్పడం లేదు. ఉధృతంగా ప్రవహిస్తున్న నది దాటి వెళ్లాల్సిన పరిస్థితి మండలంలోని జి.జంబులదిన్నె గ్రామంలో నెలకొంది. జంబులదిన్నె గ్రామానికి చెందిన వడ్ల మీరావలి కుమారుడు షాజహాన్(18) శనివారం స్నేహితులతో కలిసి ఈతకెళ్లి ప్రమాదవశాత్తు నదిలో మునిగి చనిపోయాడు. ఆది వారం అతడి అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబీకులు సిద్ధమ య్యారు. అయితే గ్రామంలో శ్మశాన సౌకర్యం లేదు. దీంతో యువకుడి మృతదేహాన్ని శవపేటిక(డోలీ)లో పెట్టుకొని ఉధృతంగా ప్రవహించే వకులా నది దాటాల్సి వచ్చింది. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న పరి స్థితిలో నదినిదాటి అవతల ఒడ్డుకు చేరాల్సి వచ్చింది. కుటుంబసభ్యులు డోలీని భుజాలపై వేసుకొని నీటి ప్రవాహాన్ని లెక్క చేయకుండా నది దాటి అవలిఒడ్డుకు చేరుకొని అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో పాలు పంచుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు సైతం ఉధృతంగా ప్రవహిస్తున్న వకులా నదిని అతి కష్టం మీద దాటి అంత్రక్రియల్లో పాలు పంచుకొన్నారు. ఇప్పటికైనా ప్రభు త్వం జంబులదిన్నె గ్రామానికి శ్మశాన వాటికను ఏర్పాటు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండల, డివిజన్, మున్సిపల్, కలెక్టరేట్‌లో నేడు ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్లు కలెక్టర్ రాజ కుమారి తెలిపారు. అర్జీదారులు నేరుగా కలెక్టరేట్‌కు వచ్చే అవసరం లేకుండా జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కార్యాలయాల్లో కూడా అర్జీలను అంద జేయవచ్చని సూచించారు.. అక్కడ పరిష్కారం కాని అర్జీలను మాత్రమే జిల్లా కేంద్రంలో జరిగే పీజీఆర్ఎస్‌లో ఇవ్వాలని సూచించారు. కలెక్టరేట్‌లో ఉదయం 9.30గంటలకు ప్రారంభమయ్యే పీజీఆర్ ఎస్‌కు ప్రతి అధికారి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

ఉరుకుంద ఆలయ డీసీగా వాణి



కౌతాళం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయపు డిప్యూటీ కమిషనర్‌గా ఆదివారం కె.వాణి బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఆలయ కార్యాలయంలో డీసీ విజయరాజు నుంచి పదవి బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇదే దేవాలయానికి వాణి అసిస్టెంట్ కమిషనర్ హోదాలో విధులు నిర్వర్తించారు. ఇక్కడ పని చేస్తున్న డీసీ విజయరాజు అనంతపురం జిల్లా కసాపురం ఆంజనేయ స్వామి దేవాలయానికి బదిలీ అయ్యారు. అక్కడ పని చేస్తున్న వాణిని ఉరుకుందకు బదిలీ కావడంతో ఆమె ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధికి మరింత పాటుపడుతానని తెలిపారు.

జయహో రాఘవేంద్రా.. విజయహో..


బంగారు పల్లకిలో విహరిస్తున్న రాఘవేంద్రుడు

- భక్తుల నినాదాలతో మార్మోగిన మంత్రాలయం
- వైభవంగా పూర్వారాధన
- స్వర్ణపల్లకిలో విహరించిన రాఘవరాయలు
- సింహవాహనంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు
- కంచి, శ్రీరంగం క్షేత్రాల నుంచి పట్టువస్త్రాల సమర్పణ



మంత్రాలయం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జయహో గురు రాఘవేంద్రా.. విజయహో అంటూ దేశ నలుమూలల నుంచి అశేష భక్తజనవాహిని తరలివచ్చి మంత్రాలయంలో తరించారు. రాఘవేంద్రస్వామి 354వ ఆరాధనోత్సవాల్లో ముఖ్యమైన పూర్వారాధన మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు సింహవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి బృందావనాన్ని ప్రహ్లాదరాయల రూపంలో అలంకరణ చేసిన దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బంగారు పల్లకిపై రాఘవేంద్రులను ఘనంగా ఊరేగించగా.. ఈ దృశ్యాలను చూసి భక్తులు ఆనందపరవశంతో తరించారు. తమిళనాడులోని శ్రీరంగంలోని రంగనాథస్వామి దేవస్థానం నుంచి, కంచి మఠం నుంచి ప్రధాన అర్చకులు అధికారికంగా స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. వీరికి శ్రీమఠం అధికారులు మహాముఖద్వారం నుంచి ఊరేగింపుతో తీసుకువచ్చి మూల బృందావనం ముందు ఉంచి పూజలు చేసి అనంతరం పీఠాధిపతిని సన్మానించారు. సింహవాహనుడైన ప్రహ్లాదరాయలను చెక్క పల్లకిలో ఊరేగించిన అనంతరం ఊంజల సేవ చేసి పీఠాధిపతి హారతులు ఇచ్చారు. వజ్ర వైఢూర్య అలంకృతుడైన ప్రహ్లాద రాయలను చెక్క వెండి గజ, బంగారు నవరత్నాలపై స్వామివారిని అధిష్టించి పీఠాధిపతి మహామంగళ హారతులు ఇవ్వగా రథాలు ముందుకు కదిలాయి. జయహో గురు రాఘవేంద్ర.. విజయహో.. తుంగా తీరనివాసా గోవిందా.. గోవిందా అంటూ భక్తులు పెద్ద ఎత్తున జయధ్వానాలతో రథోత్సవంలో పాల్గొన్నారు. సింహాకృతుడైన ప్రహ్లాద రాయలు వెండి ఊయలలో ఊంజల సేవ చేస్తుండగా.. పీఠాధిపతి స్వహస్తాలతో హారతులు ఇస్తుండగా.. భక్తులు కనులారా తిలకించి మంత్రముగ్ధులయ్యారు.

మిగతా 6వ పేజీలో


శ్రీరంగం నుంచి పట్టువస్త్రాలు తెస్తున్న ప్రధాన అర్చకులు

భక్తులతో మల్లన్న క్షేత్రం కిటకిట


దర్శనానికి వెళ్తున్న భక్తులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): భ్రమరాంబికా మల్లికార్జునస్వామి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో శ్రీశైల క్షేత్రం కిటకిటలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఇతర రాష్ట్రాలనుంచి కూడా వచ్చారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, ఆతర్వాత స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల శివనామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తులకు దేవస్థానం అధికారులు నిరంతరం తాగునీరు, అల్పాహారం అందించారు.

పలు మండలాల్లో భారీ వర్షం

● కొలిమిగుండ్లలో 98.0 మి.మీ.ల వర్షపాతం నమోదు


జిల్లా సరిహద్దు ప్రాంతంలో కొట్టుకుపోయిన ప్రధాన రహదారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో శనివారం రాత్రి పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. కొలిమిగుండ్లలో 98.0మి.మీ వర్షపాతం నమోదైంది. ఉయ్యాలవాడలో 38.8, చాగలమర్రి 38.8, రుద్రవరం 32.2, ఆళ్లగడ్డ 28.4, సంజామల 26.2, దొర్నిపాడు 20.4, కోవెలకుంట్ల 15.4, అవుకు 12.2, నంద్యాల 11.4, బండి ఆత్మకూరు 9.2, వెలుగోడు 8.2మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో పాటు మోస్తరు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది.

ఇరువర్గాల ఘర్షణలో ఒకరి మృతి 7

ప్రజల కోసం పనిచేద్దాం
● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు

జయహో రాఘవేంద్రా.. విజయహో..



మూలరాములకు పూజలు చేస్తున్న పీఠాధిపతి

5వ పేజీ తరువాయి

భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో మంత్రాలయం మఠం ప్రాంగణం, మధ్వమార్గ్ కారిడార్ ప్రధాన రహదారులు భక్తులతో మార్మోగాయి. అంతకుముందు పూర్ణబోధ పూజా మందిరంలో మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేశారు. అనంతరం శ్రీరంగం, కంచి మఠాల ప్రధాన అర్చకులకు పీఠాధిపతులు సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ రాజా ఎస్.గిరిరాజాచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఆనంద తీర్థాచార్, ప్రత్యేక అధికారులు కృష్ణ కౌశిక్, శ్రీశ్నాజోయిష్, రాజా ఎస్.అప్రమేయాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్ అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీపతిఆచార్, పూజారి వ్యాస రాజాచార్, సూపరింటెండెంట్ అనంతపురాణిక్, రవి కులకర్ణి, విజయేంద్రాచార్, జయతీర్థాచార్, ఏఈ బద్రినాథ్, ద్వారపాలక అనంత స్వామి, ప్రకాష్ ఆచార్, డీఎం ఆనందరావు, జేపీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

దర్శించుకున్న ప్రముఖులు

ఈఉత్సవాల్లో ముఖ్యఅతిథులుగా కర్ణాటక హైకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ శ్రీషానంద, జస్టిస్ టీఎం నదాఫ్, కర్ణాటక ఇరిగేషన్ శాఖ మంత్రి బోసెరాజు రాఘవేంద్రస్వామిని దర్శించుకోగా.. పీఠాధిపతి శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

ఆకట్టుకున్న భరతనాట్యం

పూర్వాధనలో భాగంగా యోగీంద్ర కళా మండపంలో రాయచూరు చెందిన మంగళ హారం, సన్నిధి నృత్య రూపకంలో భాగంగా కర్ణాటక కళా మండపం చెందిన రంజిత్, భార్గవి కూతురు మంగు సుమజ్ఞ, నిర్వహించిన భరతనాట్యం ఆకట్టుకుంది. రేస్ కాన్సెప్ట్ పాఠశాల నుంచి విద్యార్థులు, భరతనాట్య కళాకారులు చేసిన నృత్యరూపకం కనువిందు చేసింది. వీరికి మెచ్చి పీఠాధిపతి నగదు శేషవస్త్రం ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కర్ణాటక కళా మండల అధినేత మంజునాథ గోరుకల్లుకు పీఠాధిపతి అభినందించి సత్కరించారు.

ఉత్సవాల్లో నేడు..

రాఘవేంద్రస్వామి 354వ ఉత్సవాల్లో అత్యంత ప్రాముఖ్య దినమైన మధ్యారాధన మహోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. తెల్లవారుజాము 4 గంటల నుంచి 5గంటల వరకు బృందా వనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, అనం తరం 5 నుంచి 6 గంటల వరకు 500 లీటర్లతో క్షీరాభిషేకం, ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు ప్రహ్లాదరాయులకు పాదపూజ, ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విశేష పం చామృతాభిషేకం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి 11.30 బంగారు స్వర్ణ రథంపై రాఘవేంద్రుల రథోత్సవం, 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పీఠాధిపతుల సంస్థాన పూజ, 12.30 నుంచి 1.30 గంటల వరకు అలంకరణ సంతార్పణ, హస్థోదకం, 1.30 గంటల నుంచి 2.30గంటల వరకు మహా మంగళహారతి, తీర్థప్రసా దాల వితరణ ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు జ్ఞాన యజ్ఞం, రాత్రి 8.30 గంటలకు గజ, రజిత, స్వర్ణ రథోత్సవాల ఊరేగింపు, అనం తరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న అశేష భక్తజనం



సింహ వాహనంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు

ప్రముఖులకు రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డులు ప్రధానం

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి ఉత్సవాల్లో మూడో రోజు యోగీంద్ర కళామండపంలో ఆదివారం రాత్రి ప్రముఖులకు పీ ఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్ర అనుగ్రహప్రశస్తి అవా ర్డులను ప్రదానం చేశారు. వారణాసికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త రాజారాం శుక్లా కోయంబత్తూరు చెందని పారిశ్రామికవేత్త పీఆర్ విఠల్‌కు అవార్డులను ప్రదానం చేసి వెండి తట్ట, మెమెంటో, నగదు ఇచ్చి సత్కరించారు. అలాగే విద్వాన్ పండిత కేసరి రాజాఎస్ గిరిరాజాచార్, గౌహతి హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ శ్రీధర్‌రావు, మఠం ఏఏవో, దేవదాయశాఖ రిటైర్డు రీజనల్ జాయింట్ కమిషనర్ ఎల్.మాధవశెట్టికి వెండి తట్ట, మెమెంటో, నగదు, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ సుశాంత్ కుమార్, మంత్రాలయం మేనేజర్ నాగార్జున, ఎస్కే శ్రీనివాసరావు, అబోడే హోటల్ మేనేజర్ రజనీకాంత్ పాల్గొన్నారు.



రాఘవేంద్ర అనుగ్రహ అవార్డును కాశీకి చెందిన రాజారామ్ శుక్లాకు అందజేస్తున్న పీఠాధిపతి



కోయంబత్తూరు పీఆర్ విఠల్‌కు అవార్డు అందజేస్తున్న పీఠాధిపతి

పుష్కరిణితో మంత్రాలయానికి మరింత గుర్తింపు

● శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



పుష్కరిణి గురించి కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీషానంద, కర్ణాటక మంత్రి బోసే రాజుకు వివరిస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రుని సన్నిధిలో పుష్కరిణి నిర్మించడం మంత్రాలయానికి మరింత గుర్తింపు వచ్చిందని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. ఆదివారం కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీషానంద, కర్ణాటక చిన్ననీటి పారుదల శాఖ మంత్రి బోసెరాజు, కంచి ప్రధాన అర్చకుడు శ్రీరంగం ప్రధాన అర్చకులతో కలిసి రూ.3.50 కోట్లతో బెంగళూరుకు చెందిన ప్రకాష్ శెట్టి నిర్మించిన పుష్కరిణి గురించి పీఠాధిపతి వారికి వివరించారు. చుట్టూ అందమైన ప్రాకారం, పుష్కరిణి మధ్యలో రాతిశిలా మండపం, తెప్పోత్సవంలో స్వామి వారిని ఊరేగించేందుకు తెప్పోత్సవం గురించి వారికి వివరించారు. అనంతరం పీఠాధిపతి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాముఖ్యమైన దినాల్లో మాత్రమే ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు తెప్పోత్సవంపై విహరిస్తున్నారని, రానున్న రోజుల్లో తెప్పోత్సవంపై ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుం టామని అన్నారు. భక్తుల సౌకర్యార్థం కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు, మహా రాష్ట్రల నుంచి భక్తులు ముందుకు వస్తున్నారని, భక్తుల సాకారంతో భక్తులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంక టేశ్ జోషి, శ్రీపతాచార్, సూరేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి, సుజయీ ంద్రాచార్, బద్రినాథ్ ఆచార్, ఏఈ బద్రీనాథ్, హరిదాస్, ప్రకాషాచార్ పాల్గొన్నారు.

మంత్రాలయంలో గెస్టుహౌస్‌ను పునర్నిర్మిస్తాం



మాట్లాడుతున్న కర్ణాటక మంత్రి బోసెరాజు

మంత్రాలయం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే కర్ణాటక భక్తులకు గెస్టుహౌస్ కల్యాణ మండపాన్ని పునర్నిర్మిస్తామని కర్ణాటక నీటి పారుదల శాఖ మంత్రి బోసెరాజు అన్నారు. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థం ఆయన మంత్రాలయానికి వచ్చారు. ఆయనకు శ్రీమఠం అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మంత్రాలయంలోనే కాకుండా శ్రీశైలానికి వచ్చే భక్తులకు గతంలో ఉన్న టూరిజం స్థలం లీజు పూర్తయినందు వల్ల స్థల పరిశీలన కోసం అధికారులకు అధికారికంగా లేఖ రాస్తున్నామని, ఇందుకు అవసరమైన రూ.92 కోట్లు కర్ణాటక ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. మంత్రాలయం మఠం రోజురోజుకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అభివృద్ధి పనులతో పాటు పరిమళ పుష్కరిణి నిర్మించడం అద్భుతంగా ఉందన్నారు. శ్రీమఠానికి అవసరమైన సహాయ సహకారాలు కర్ణాటక ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా చేయూతనం దిస్తామన్నారు. రవాణా వసతులు, రోడ్లు అన్ని రకాల సహకారం ఉంటుం దన్నారు. మంత్రాలయంలో కర్ణాటక టూరిజం ఆధ్వర్యంలో నిర్మించిన భవ నాలు పాతబడటంతో వాటిని తొలగించి కొత్త భవనాలు నిర్మాణానికి ముఖ్య మంత్రితో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో కర్ణాటక శ్రీమఠం అసిస్టెంట్ ఇంజనీర్ ఇడపనూరు సంజీవ కులకర్ణి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

తెర స్మరణీయ నాటక రచయిత 'పల్లేటి లక్ష్మీకులశేఖర్'

టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య



ప్రముఖ నాటక రచయిత పల్లేటి లక్ష్మీకులశేఖర్‌కు నివాళులు అర్పిస్తున్న పత్తి ఓబులయ్య, కళాకారులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగతంగా 12 నంది అవార్డులు, నాటక రచనల ద్వారా నటులకు 86 నంది అవార్డులు తెచ్చిపెట్టిన తెర స్మరణీయ నాటక రంగ రచయిత దివంగత పల్లేటి లక్ష్మీకులశేఖర్ అని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య కొనియాడారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రముఖ సాంఘిక, పద్య నాటక రచయిత పల్లేటి లక్ష్మీకులశేఖర్ ప్రథమ వర్ధంతి సభ జరిగింది. ఈ సభలో కులశేఖర్ చిత్రపటానికి పూల దండలు వేసి కవులు, నాటక రంగ కళాకారులు నివాళులర్పించారు. సభకు అధ్యక్షత వహించిన పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఆధునిక తెలుగు పద్య నాటక రంగాన్ని ముందుకు తీసుకుపోయిన ఘనత పల్లేటి లక్ష్మీకులశేఖర్‌కు దక్కుతుందని, ఆయన పద్య నాటకాలే రాష్ట్ర వ్యాప్తంగా వందలాది ప్రదర్శనలు అందుకొని ఆయనతోపాటూ కర్నూలు కళారంగానికి కీర్తిప్రతిష్ఠను తెచ్చిపెట్టాయని గుర్తు చేశారు. టీజీవీ కళాక్షేత్రానికై ఆయన ప్రత్యేకంగా రాసిన నాటకాల ద్వారా 35 నంది అవార్డులు వచ్చాయని, ఆయన కళాక్షేత్రం ఆస్థాన రచయితగా రాణించారని గుర్తుచేశారు. పల్లేటి లక్ష్మీకులశేఖర్ అకాల మరణం నాటక రంగానికి తీరని లోటని శ్లాఘించారు. ఈ సభలో కళాక్షేత్రం కార్యదర్శి సి. యాగంటీశ్వరప్ప, కళాకారులు జీవీ శ్రీనివాసరెడ్డి, పి. రాజారత్నం, గాండ్ల లక్ష్మన్న, కదిరి రమేష్, కేవీ రమణ, పీవీ గురుమూర్తి, లక్ష్మీకాంతరావు, క్రిష్టఫర్, మద్దయ్య, సి. నవీన్‌కుమార్ చౌదరి, శామ్యూల్, హార్మోనిస్టు గురువు బలరాముడు తదితరులు పాల్గొన్నారు. రక్షాబంధన్ వేడుకలో భాగంగా అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని గుర్తు చేసే 'రక్తసంబంధం' తెలుగు చలనచిత్రాన్ని కళాక్షేత్రంలో ప్రదర్శించారు. అలనాటి తెలుగు చిత్ర కథానాయకుడు ఎన్టీ రామారావు, సావిత్రి, దేవిక, కాంతారావు తదితరులు నటించిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆసక్తిగా వీక్షించారు.

ప్రజల కోసం పనిచేద్దాం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం పనిచేద్దామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. నగరంలోని పున్నమి ఫంక్షన్ హాలులో ఆదివారం రెండు రోజుల పాటు జరుగుతున్న సీపీఐ 24వ జిల్లా మహాసభలలో రెండో రోజు ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సభకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజాసాహెబ్, విరూపాక్షి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.శ్రావణి అధ్యక్షత వర్గంగా ఉన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య హాజరయ్యారు. రామ కృష్ణ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. ప్రతిపక్షంలో ఒకలా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో నిత్యం కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువజనులు, శ్రామికులు, మహిళల పక్షాన నిలిచి వారి వాణి వినిపిస్తున్నందునే వారు మన వైపు ఉన్నారన్నారు. పేరుకే కూటమి ప్రభుత్వమైనా మన రాష్ట్రంలో నరేంద్రమోదీ, అమిత్‌షా, ఆర్‌ఎస్‌ఎస్ అజెండాలు అమలు చేస్తున్నా రని ఆరోపించారు. సెప్టెంబరు 21 నుంచి 25 వరకు చండీఘర్‌లో జరిగే సీపీఐ జాతీయ మహాసభల అనంతరం ఉద్యమాలకు సిద్ధమ వుతామన్నారు. ఒంగోలులో ఆగస్టు 23నుంచి 25వరకు రాష్ట్ర మహా సభలలో రాష్ట్ర పరిణామాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ప్రతిప క్షంలో చంద్రబాబు విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణను వ్యతిరేకిం చారని, ఆతర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత అడ్డుకోవడంలో వి ఫలమయ్యారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గిం చినా పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీ లు పెంచేది లేదని చెప్పి నేడు రూ.15,485 కోట్ల భారం ప్రజలపై మోపారని ధ్వజమెత్తారు. స్మార్ట్ మీటర్లు వద్దని చెప్పి వాటిని బిగిస్తున్నారని అన్నారు. ఆర్టీసీ, నీటి జలాలు కూడా ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎటువంటి ఉపయోగం లేని బనకచర్ల ప్రాజెక్టుకు రూ.82వేల కోట్లు ఖర్చు చేయాలని చూస్తున్నారని, జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే సరిపో తుందన్నారు. 2029నాటికి పేదరికం లేని రాష్ట్రంగా మారుస్తానని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేసి హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేసి, పరిశ్రమలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం దాసరి నాగభూషణం నీతి నిజాయితీ నిస్వార్థప రుడు అని కొనియాడారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయు లు, ఆవుల శేఖర్, ఎన్.లెనిన్‌బాబు, జిల్లాకార్యదర్శి గిడ్డయ్య, సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా గిడ్డయ్య

● వరుసగా మూడోసారి ఎన్నిక

● సహాయ కార్యదర్శులుగా లెనిన్‌బాబు, మునెప్ప



బి.గిడ్డయ్య

సీపీఐ జిల్లా కార్యదర్శిగా బి.గిడ్డయ్య ఎంపికయ్యారు. వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా నక్కి లెనిన్ బాబు, మునెప్ప, కార్యవర్గ సభ్యులుగా జగన్నాథం, నబీ రసూల్, మద్దిలేటి శెట్టి, రాజాసాహెబ్, రామకృష్ణారెడ్డి, లలితమ్మ, శ్రావణిరెడ్డి, పంపన్నగౌడు, భాస్కర్ యాదవ్, జి.చంద్రశేఖర్, రంగన్న, విరుపాక్షి, కారుమంచి సుదర్శనం, కె.శ్రీనివాసులు, బి.రా జు, 65 మంది జిల్లా సమితి సభ్యులను ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఐ 24వ జిల్లా మహాసభలు రెండు రోజులుగా స్థానిక ఏపీ టూరిజం ఫంక్షన్ హాలులో జరిగాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్య దర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ముఖ్యఅతిథు లుగా హాజరయ్యారు. మహాసభలో భాగంగా రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా కార్యదర్శి కోసం లెనిన్‌బాబు, మునెప్పలు సైతం పోటీ పడ్డారు. అయితే మెజారిటీ సభ్యుల అభిప్రాయం మేరకు జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇరువర్గాల ఘర్షణలో ఒకరి మృతి

- త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మృతుల బంధువుల ఆందోళన



లక్ష్మన్న (ఫైల్)

ఆదోని, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అరుణ్‌జ్యోతి నగర్‌లో జరిగిన ఇరువర్గాల మధ్య ఘర్షణలో ఒకరు మృతిచెందారు. న్యాయం చేయాలంటూ మృతుడి బంధువులు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం రాత్రి ఆందోళనకు దిగారు. సీఐ రామలింగమయ్య, మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.... అరుణ్‌జ్యోతినగర్‌లో నివాసముంటున్న శ్రీనివాసులు, వీరేష్ కుటుం బాలు పక్కపక్కన నివాసం ఉంటున్నారు. రహదారి విషయంలో గతంలో ఈ రెండు కుటుంబాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఇటీవల వర్షాలు అధికంగా కురుస్తుండడంతో వీరేష్ నీళ్లు ఉన్న కారణంగా ఆయన కుమారుడు గిరిబాబు మిద్దె పైకెక్కి నీటిని కిందికి తోడేసేందుకు పనిలో నిమగ్నమయ్యాడు. దీన్ని గమనించిన వీరేష్ కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలిపి, తమ ఇంటి ముందు నీళ్లు పడుతున్నాయంటూ ఒకరినొకరు దూషించుకుంటుండగా గిరిబాబు చిన్నాన్న లక్ష్మన్న(50) అక్కడ చేరుకొని వీరేష్ కుటుంబ సభ్యులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. వీరి మధ్య సఖ్యత కుదరకపోవడంతో ఒకరిపైపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో లక్ష్మన్నకు గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో స్థానిక ఆదోనిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ కూడా పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో అంబులెన్స్ సాయంతో కర్నూలుకు బయలుదేరారు. కర్నూలుకు వెళ్తుండగా ఎమ్మిగనూరు సమీపంలో లక్ష్మన్న తుది శ్వాస విడిచినట్లు అంబులెన్స్‌లోని వైద్యులు గుర్తించారు. దీంతో మృతదేహాన్ని ఆదోనికి తీసుకొచ్చి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద మృతుడి బంధువుల న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. త్రీటౌన్ సీఐ రామలింగమయ్య, వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ ఇద్దరు కూడా మృతుడి బంధువులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. గంటపాటు ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు పోలీసులు ఇచ్చిన హామీలతో ఆందోళన విరమించి పోస్టుమార్టం నిమిత్తం లక్ష్మన్న మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని సీఐ రామలింగమయ్య తెలిపారు.



పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన మృతుడి బంధువులు

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



సుదర్శన్(ఫైల్)

తుగ్గలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఏటా సాగు చేసిన పంటలు అప్పులే మిగిలిస్తుం డటంతో పొలంలోనే పురుగుల మందు తాగి యువ రైతు సుదర్శన్ (30) ఆత్మహత్య చేసుకున్నారు. మండలంలోని కడమకుంట్ల చెందిన యువ రైతు సుదర్శన్ పొలంలో పురుగు మందు తాగడంతో గుర్తించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జొన్నగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం పత్తికొండ వైద్యశాలకు తరలించారు. రైతు తనకున్న నాలుగెకరాల పొలంతో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ, కంది, టమోటా, మిరప పంటలు సాగు చేశాడు. పంటల సాగుకు చేసిన అప్పులు ఏటేటా పెరుగుతూ రూ.10 లక్షలకు చేరడంతో అప్పులు ఎలా తీర్చాలో అర్థం గాక అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ ఫక్కీరప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ..



వడ్డె మధు (ఫైల్)

ఓర్వకల్లు, ఆగస్టు 10 ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక కుటుంబాన్ని పోషించలేక ఓ కౌలు రైతు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మండ లంలోని గుట్టపాడు గ్రామానికి చెందిన కౌలురైతు వడ్డె మధు (36) శుక్రవారం తన ఇంట్లో ఉన్న పురుగుమందును తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తర లించారు. కోలుకోలేక మృతి చెందాడు. మృతుడు ఐదెకరాల పొలంలో ఐదేళ్లుగా పంటలు పండక, గిట్టుబాటు ధర లేక రూ.8 లక్షల దాకా అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది పురుగు మందు తాగాడు. పత్తి, మొక్కజొన్న వివిధ పంటలు సాగు చేశాడు. మృతుడికి భార్య మౌనిక, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

కోవెలకుంట్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈఘటన పట్టణంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని ఎల్.ఎం.కాంపౌండ్‌కు చెందిన అశోక్(40) ఆర్టీసీ బస్టాండులో బస్సులను శుభ్రం చేస్తూ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ శనివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకన్నాడు. ఆదివారం తెల్లవారుజామున భార్య శ్యామల లేచి చూడగా భర్త ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని విషయం తెలుసుకుని బంధువులకు, పోలీసులకు సమాచారం ఇచ్చింది. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. అశోక్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

పిల్లలపై దృష్టి పెట్టాలి: ఎస్‌ఐ

పాములపాడు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నిత్యం పిల్లల ప్రవర్తనలో వస్తున్న మార్పులను తల్లిదండ్రులు గమనిస్తూ అందుకు అనుగుణంగా సలహాలు, సూచనలు చేస్తుండాలని ఎస్‌ఐ సురేశ్‌బాబు తెలిపారు. ఆదివారం పాములపాడు బస్టాండు కూడలిలో మత్తు పదార్థాలకు పిల్లలను దూరంగా ఉంచాలనే విషయమై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలవుతున్నారని, వాటిని బాల్యంలోనే అరికట్టాలని, చెడువ్యసనాల వైపు యువత వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, ఈ మధ్య కాలంలో విద్యార్థులు ద్విచక్ర వాహనం నడుపుతూ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటలను గుర్తు చేశారు. సెల్‌ఫోన్‌లు ఎక్కువగా చూస్తుంటే పెద్దలు మందలించాలని, లేదంటే ఆన్‌లైన్ గేములకు అలవాటు పడి జీవితాలు నాశనమవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆధునిక ఉత్పత్తులతో మంచి దిగుబడులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతో కూడిన ఉత్పత్తులను రైతులు ఉపయోగించినప్పుడే మంచి దిగుబడులు సాధించవచ్చని ఆదామా ఇండియా కంపెనీ ప్రతినిధులు అన్నారు. నంద్యాల మూలసాగరంలోని ఎస్ఎన్ ఫంక్షన్ హాల్‌లో ఆదామా ఇండియా ఆధ్వర్యంలో ప్రత్యేక మైక్రోనిష్ టెక్నాలజీతో తయారైన కొత్త శిలీంద్ర సంహారిని కస్టోడియా ప్రైమ్‌ను కంపెనీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ హెడ్ శ్రీనివాసరావు, ఫంగిసైడ్ పోర్ట్ ఫోలియో హెడ్ శాంతిలత మాట్లాడుతూ నూతన సాంకేతికతో తయారైన ఉత్ప త్తులను వాడడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఆదామా తయారు చేసిన మందులను రైతులు ఎంతగానో ఆదరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కొత్త ఆలోచనలు, కొత్త టెక్నాలజీ కలిస్తేనే రైతుకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. ఆదామీ కంపెనీ ప్రతినిధులు రాజశేఖర్‌రెడ్డి, శేషాద్రిరెడ్డి, నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.ఫోటోరైటప్స్:

వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్ననగిరి శ్రీనివాసులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. నంద్యాల ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతన సవరణ సంఘం గడువు ముగిసి రెండేళ్లు అయినప్పటికీ నేటికీ 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యుడు సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, అదనపు కార్యదర్శి మల్లయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని, 72,73,74 జీవోలను అమలుచేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయులు, పోలీసులు, ఇతర ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా 11వేల మంది ఉన్నారని, వీరందరికీ వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కరోనా సమయంలో మరణించిన ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియా మకాలు చేపట్టాలని విన్నవించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు గోపాల్‌రావు, జయరామ్, మహబూబ్‌బాషా, మానపాటి రవి, మునిస్వామి, నగిరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులను ఉపసంహరించుకోండి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసం హరించుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నంద్యాలలో ఆదివారం సీపీ ఎం కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకుల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకుడు రఫీ, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, ఎంఆర్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల సమ స్యల కోసం పోరాడుతున్న విద్యార్థి సంఘాలను పాఠశాలల్లోకి ప్రవేశించకూడనే విధంగా జీవోలు జారీ చేయడం సరికాదన్నారు. విద్యార్థి సంఘాల చొరవతో పాఠశాలలు, హాస్టళ్లలో నేడు అనేక మౌలిక సదుపాయాలు సమకూరాయని గుర్తు చేశారు. ఈ ఉత్త ర్వులను వెంటనే రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాగార్జున, రాంబాబు, షేక్ షాహిద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజన్ బోట్లు నడిపేందుకు అనుమతి తప్పనిసరి

- నదీతీర ప్రాంతాన్ని పరిశీలించిన సీఐ


మూర్వకొండ ఘూట్‌ను పరిశీలిస్తున్న సీఐ

పగిడ్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో అనుమతులు లేకుండా ఇంజన్ బోట్లు నడుపుతే చర్యలు తీసుకుంటామని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం నిర్వాహకులను హెచ్చరించారు. మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామ సమీపంలోని కృష్ణానది వద్ద ఏర్పాటు చేసిన మూర్వకొండ, అర్లపాడు ఘూట్‌ను ఆయన ఆదివారం సా యంత్రం పరిశీలిం చారు. ఇంజన్‌బోటు ప్రయాణాలకు ప్రభుత్వ అను మతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. నదిలో పూర్తిస్థాయిలో వరద నీరు ఉండటంతో ఇంజన్‌బోట్లు ప్రయాణాలు నిషేధించామని, ఎవరైన బోట్లు నడుపుతే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. నదీలో బోట్లు నడవకుండా సిబ్బందిని ఏర్పాటు చేస్తామని వివరించారు.

అ'పూర్వ' సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

గడివేముల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గని హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అలరించింది. 24 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థులు ఒకే చోట కలుసుకొని వారి విద్యాదశలో గడిపిన మధురక్షణాలను గు ర్తు చేసుకుంటూ ఆనందం పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు నాగపుల్లయ్య, నూర్‌అహ్మద్, మద్దిలేటి, సాయిలి మ్మయ్య, రాంభూపాల్‌రెడ్డి, అలి, రాముడు, కేశమ్మలను ఘనంగా సన్మానించారు. అలాగే పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహ కారం అందిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలకు కంప్యూటర్‌ను అందజేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసు కుంటూ కుశల ప్రశ్నలు వేసుకున్నారు. వారి కుటుంబ యోగక్షేమాలను స్నేహితులతో పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంత కష్టం..ఏమిటీ నిర్లక్ష్యం..?



శిథిలావస్థలో నంద్యాల దేవనగర్ బీసీ బాలుర వసతిగృహం

వసతి గృహాల్లో అన్ని రకాల వసతులతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటేనే విద్యార్థుల చదువు సాఫీగా, మెరుగ్గా సాగుతుందన్న విషయం తెలిసిందే. అయితే పాడుబడి, కూలిపోయే స్థితిలో ఉన్న భవనంలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. విద్యార్థులున్న భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్నా దానికి మరమ్మతులు చేయలేదు. 'మా మొర ఆలకించండి మహాప్రభో' అంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తుండటంతో వారిని ఇరుకైన ప్రైవేటు భవనంలోకి మార్చారు. దీంతో విద్యార్థుల సంఖ్య దారుణంగా పడిపోయింది. నంద్యాల బీసీ బాలుర వసతి గృహం దుస్థితి ఇదీ..

- శిథిలావస్థలో బీసీ బాలుర వసతిగృహం
- ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల భయం

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు 200 నుంచి 300 మంది విద్యార్థులతో కళకళలాడే దేవనగర్ బీసీ బాలుర వసతి గృహం నేడు అధికారుల నిర్లక్ష్య వైఖరితో ప్రాభవం కోల్పోయి దీనావస్థకు చేరుకుంది. 2015 సంవత్సరానికే భవనం శిథిలావస్థకు చేరడంతో అప్పటి నుంచి విద్యార్థులను హాస్టల్ ఎదురుగానే ఉన్న ఓ ప్రైవేటు భవనంలోకి మార్చారు. వంద మంది విద్యార్థులు ఒకే గదిలో ఉంటూ వచ్చారు. తీవ్ర అసౌకర్యంగా ఉండటంతో నేడు 35 మందికే పరిమితమయ్యారు. విద్యార్థులకు ఆటస్థలం లేకపోవడంతో శిథిలావస్థకు చేరిన భవనం ఎదుటనే ప్రమాదకర పరిస్థితుల్లో ఆడుకుంటున్నారు. అలాగే పెచ్చులూడి పూర్తిగా శిథిలమైన భవనాల వద్ద విద్యార్థులకు వంట చేస్తున్నారు. ప్రైవేట్ భవనానికి వేలకు వేలు చెల్లిస్తున్నారే కాని నూతన భవనాన్ని ఏర్పాటు చేయడం లేదు. ప్రమాదమని తెలిసినా శిథిలమైన భవనంలోనే ఓ గదిలో హాస్టల్ కార్యాలయాన్ని ఏర్పాటుచేసుకున్నారు. ప్రైవేట్ గదిలో స్థలం లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ ఆగదిలోనే గడుపుతున్నారు. 2015 నుంచి నేటివరకు అధికారులు, ప్రజాప్రతినిధులు అనేక సార్లు పర్యటించినా హాస్టల్ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. మరీ ఇంత నిర్లక్ష్యమైతే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వసతిగృహాల్లో సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఎలా నివసిస్తారని, ఏదైనా జరిగితే పరిస్థితి ఏమిటని పేర్కొంటున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

బీసీ సంక్షేమశాఖ ద్వారా నూతన బిల్డింగ్ నిర్మాణానికి ప్రతి పాదనలు పంపడం జరిగింది. 2024లో రూ.4.50కోట్లు మం జూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయే కాని ఆర్థికశాఖ నుంచి స్పం దన లేకపోవడంతో నిర్మాణ పనులు జరగలేదు. అద్దె భవనంలో విద్యార్థులకు అసౌకర్యంగా లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. శిథిలావస్థలో ఉన్న హాస్టల్ వైపు విద్యార్థులు వెళ్లకుండా చూస్తాం. ● ముంతాజ్‌బేగం, వార్డెన్


ప్రమాదకరంగా ఉన్న భవనం వద్దనే ఆడుకుంటున్న విద్యార్థులు


పెచ్చులూడుతున్న భవనం కిందనే విద్యార్థులకు వంట చేస్తున్న దృశ్యం


ప్రైవేటు భవనంలో ఒకే గదిలో 35 మంది విద్యార్థులు

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలి

కొత్తపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద మంజూరైన గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకుంటే తక్షణమే బిల్లులు చెల్లిస్తామని మండల హౌసింగ్ ఏఈ పాండురంగ నాయక్ లబ్ధిదారులకు సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని గువ్వలకుంట్లలో మాట్లాడుతూ మంజూరైన గృహాలకు లబ్ధిదారులు తక్షణమే నిర్మాణ పనులు చేపట్టాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాలకు పీఎంఏవైజీ (ప్రధానమంత్రి ఆవాజ్ యోజన గ్రామీణ పథకం) కింద 286 గృహాలు మంజూరు కాగా, నేటికి 96 గృహాలు పూర్తయినట్లు చెప్పారు. వీటిలో కేంద్రం వాటా రూ.1.20 లక్షలు కాగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.60వేలు ఇస్తుందని తెలిపారు. బీఎల్‌సీ కింద రాష్ట్ర ప్రభుత్వం 235 గృహాలను మంజూరు చేయగా.. నేటికి 69 పూర్తయినట్లు తెలిపారు. పథకాల కింద నిర్మించిన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఎస్సీ బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, చెంచులకు రూ.లక్ష చొప్పున అదనంగా మంజూరు చేసినట్లు ఆయన వివరించారు. అంతేగాకుండా పీఎం జన్‌మన్ కింద 170 గృహాలు మంజూరు కాగా, ప్రస్తుతం 20 గృహాలు పూర్తయినట్లు తెలిపారు. ఈ పథకం కింద ఒక్కొక్క గృహానికి రూ.2.39 లక్షలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుండగా.. మరో రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని వివరించారు.


మాట్లాడుతున్న ఏఈ పాండురంగ నాయుడు

కుక్కల బెడదను అరికట్టాలి: సీపీఎం


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రణధీర్

ఆత్మకూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కుక్కల బెడద ను అరికట్టాలని సీపీఎం నాయకుడు రణధీర్, సురేంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమా వేశంలో వారు మాట్లాడారు. పట్టణంలోని అన్ని వీధుల్లో కుక్కల బెడదతో జనం అల్లాడిపోతున్నారన్నారు. ప్రతిరోజు ఎక్కడో ఓచోట ప్రజలు కుక్కలబారిన పడి గాయపడుతున్నారని చెప్పారు. దీంతో పిల్లలు, వృద్ధులు రోడ్లపై తిరగాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పట్టణంలో కుక్కల స్వైరవిహారం ఉన్నప్పటికి మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడదను తీర్చాలని, లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

సీఐటీయూ నూతన కమిటీ ఎన్నిక

ఇటీవల జరిగిన పట్టణ 3వ మహాసభల సందర్భంగా ఆత్మకూరు పట్టణ సీఐటీయూ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏసు రత్నం ఆదివారం తెలిపారు. ఈ కమిటీ అధ్యక్ష, కార్యర్శులుగా సద్దాం, రామ్ నా యక్, ఉపాధ్యక్షులుగా రణధీర్, రజాక్, రైట్‌బాషా, సహాయ కార్యదర్శులుగా భారతి, నాగన్న, మల్లయ్య, కోశాధికారిగా మంజుల, కమిటీ సభ్యులుగా పుల్లయ్య, శివకుమార్, నాగరాజు, రవిజాబీ, ప్రభావతి, బేగంబీ, లక్ష్మీదేవీ, శాంతి, కోఆప్షన్ సభ్యులుగా ఆరు మంది సభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

పాణ్యం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దినేష్‌బాబు తెలిపారు. మండలంలోని మోడల్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలలో తృతీయ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 8, 9 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన అసోసియేషన్ జూనియర్స్ మీట్‌లో బాలుర విభాగంలో టార్గెట్‌బాల్ టోర్నమెంట్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం సాధించారన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో పీడీ కిరణ్‌కుమార్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

పాములపాడు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రజలను దోచుకోవ డానికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం జిల్లా సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం పాములపాడులో వారు మా ట్లాడుతూ వైసీపీ పాలనలో తొమ్మిది సార్లు కరెంటు బిల్లులు పెంచారని, తాము అధికారంలోకి వస్తే కరెంటు బిల్లులు తగ్గిస్తామని చెప్పిన పెద్దలు నేడు కరెంటు బిల్లులను విపరీతంగా పెంచి ప్రజలపై పెను భారాన్ని మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్య దర్శి సోమన్న, రైతుసంఘం నాయకులు వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, బాలయ్య, రాజు, నారయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

జూపాడుబంగ్లా, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాస్కరాపురం గ్రామంలో మూడురోజుల నుంచి హోమాలు నిర్వహించి ఆదివారం వేద పండితుల ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నుంచి హోమాలను నిర్వహించి ఆదివారం నవ గ్రహాలు, వీరభద్ర స్వామి, నాగమయ్యకట్టల విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

బంగారు పడిగె విరాళం

పాణ్యం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు బంగారు పడిగె విరాళంగా అందజేశారు. ఆదివారం బనగానపల్లె పట్టణానికి చెందిన నవీన్‌కుమార్, గీత దంపతుల కుమారుడు, కుమార్తెలు రియాన్స్, రోహిత్ ఆలయ ఈవో రామకృష్ణకు తులం బంగారు పడిగె అందజేశారు. ఈ సందర్భంగా భక్తుల కు ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్‌గా షాబుద్దీన్

- కమిటీలో సభ్యులుగా మరో ఇద్దరికి చోటు


షాబుద్దీన్

ఆత్మకూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ది ఆత్మకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ పాలక వర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఎక్స్‌అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీ.రాజశేఖర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. త్రిసభ్య కమిటీలో చైర్మన్‌గా ఆత్మకూరు పట్టణంలోని కొత్తపేటకు చెందిన టీడీపీ సీనియర్ మైనార్టీ నాయకుడు షాబుద్దీన్‌తో పాటు సభ్యులుగా అమరం రమేష్ (నల్లకాల్వ) ప్రమీన్‌కుమార్ (వెంకటాపురం)కు అవకాశం కల్పించారు. చైర్మన్‌గా నియమితులైన షాబుద్దీన్ కుటుంబం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అనుచర వర్గంలో ఎన్నో ఏళ్ల నుంచి కీలకంగా వ్యవహరించింది. టీడీపీ మైనార్టీ విభాగంలో ఎనలేని సేవలందించి పార్టీ గెలుపునకు కృషి చేశారు. ఈయన సేవలను గుర్తిస్తూ శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సింగిల్ విండో చైర్మన్‌గా అవకాశం కల్పించారు. అదేతరహాలో నల్లకాల్వ గ్రామానికి చెందిన అమరం రమేష్, వెంకటాపురం గ్రామానికి ప్రవీణ్‌కుమార్‌లు తొలినుంచి టీడీపీని నమ్ముకుని ఉన్నారు. దీంతో వీరికి కూడా సింగిల్ విండో డైరెక్టర్లుగా చోటు కల్పించారు. కాగా 2026 జనవరి 30వ తేది వరకు వీరి పదవీ కాలం ఉంటుంది. ఆతర్వాత మరో ఆరునెలల చొప్పున పొడిగిం చుకుంటూ.. రెండేళ్ల పాటు వారిని ఈ పదవిలో ఉంచేందుకు అవకాశం ఉంది. కాగాఆ ఆత్మకూరు ప్రాంతంలో టీడీపీ బలోపేతానికి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి గెలుపునకు కృషి చేసిన తమకు గుర్తించి బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయ పరపతి సంఘం తరపున రైతులకు అన్ని విధాలుగా తోడ్పడతామని వారు తెలిపారు.

దుర్గంధంలో హైవే డ్రైనేజీలు

- ప్రమాదకరంగా మారిన వైనం
- వాగులను తలపిస్తున్న సర్వీసు రోడ్లు
- నిర్లక్ష్యం వీడని హైవే అధికారులు


ఆర్జీఎం ఇంటర్నేషనల్ పాఠశాల వద్ద సర్వీసు రోడ్డుపై నిలిచిన నీరు, అసంపూర్తిగా నిలిచిన మురుగు కాలువల నిర్మాణం


సర్వీసు రోడ్డు డ్రైనేజీలో నిలిచిన మురుగు

పాణ్యం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): హైవే అథారిటీ ఆఫ్ ఇండియా 40 సర్వీసు రోడ్లు, డ్రైనేజీలు అధ్వానంగా మారాయి. కర్నూలు, కడప జాతీయ రహదారి సర్వీసు రోడ్లు, మురుగు కాల్వలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. అలాగే ప్రాణాపాయంగా మారాయి. నిత్యం పర్యవేక్షించాల్సిన హైవే సిబ్బంది తూతూ మంత్రంగా పనులు కొనసాగిస్తున్నారు. కేవలం జాతీయ ర హదారిని మాత్రమే పర్యవేక్షిస్తూ సర్వీసు రహదారులను నిర్లక్షం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2010లో ప్రారంభించిన హైవే రహదారి నిర్మాణాలు ఇప్పటికీ పూర్తి కాలేదు. పాణ్యం మండలంలోని పాణ్యం, కౌలూరు, నెరవాడ, తమ్మరాజుపల్లె పరిధిలోని 174.9 ఎకరాల ప్రైవేటు, 12.5 ఎకరాల ప్రభుత్వ భూములను రహదారి విస్తరణకు సేకరించారు. ఈ సేకరణలో భాగంగా వాణిజ్య, గృహ, ప్రభుత్వ భవనాలు తొలగించారు. దీంతో హైవేపై జీవిస్తున్న వందలాది కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయి. జీవనోపాధి కోల్పోయిన చోట అభివృద్ధి పనులు మాత్రం నిలిచిపోయాయి. పాణ్యం, ఆర్జీఎం ఇంటర్‌నేషనల్ పాఠశాల, నెరవాడ మెట్ట వద్ద సర్వీసు రోడ్లు అధ్వానంగా మారాయి. నిత్యం రహదారిపై నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది.

మురుగు నిల్వలుగా మారిన డ్రైనేజీలు

హైవే డ్రైనేజీలు మురుగు నిల్వలుగా మారాయి. కాల్వలు రహదారులకు సమాంతరంగా మురుగునీటితో నిండి ప్రమాదకరంగా మారాయి. ఆర్జీఎం ఇంటర్‌నేషనల్ పాఠశాల వద్ద మురుగు నీటితో నిండిన హైవే సర్వీసు డ్రైనేజీలలోని నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. పలుమార్లు హైవే అధికారులకు విన్నవించినా ఎటువంటి స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీలు దాదాపు మూడు అడుగుల లోతుగా ఉండి నీటితో నిండి విద్యార్థులకు ప్రమాదకరంగా మారాయని పాఠశాల యాజమాన్యం ఆరోపిస్తుంది. మురుగునీటితో దోమలు పెరిగి విద్యార్థుల అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొంటున్నారు. అలాగే రహదారి నీటితో నిండి వాగును తలపిస్తోందని, దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని పేర్కొంటున్నారు.

వీయూపీ, పీయూపీలపై ప్రజల ఆగ్రహం

పాణ్యం, నెరవాడ మెట్ట శాంతిరాం ఆసుపత్రి వద్ద గల వెహికల్ అండర్ పాస్, పబ్లిక్ అండర్‌పాస్‌లలో నిత్యం నీరు నిలిచి ప్రజలు రాకపోకలు సాగించడానికి నానాతంటాలు పడాల్సివస్తోంది. పాణ్యం లోని పీయూపీలో పాములు చేరి ప్రమాదకరంగా మాదింది. ఇటీవల 15అడుగుల కొండచిలువను పీయూపీలో అటవీ శాఖ సిబ్బంది పట్టి పిన్నాపురం కొండల్లో వదిలివేశారు.

హైవే అధికారుల నిర్లక్ష్యంతోనే అవస్థలు

హైవే సర్వీసు రోడ్లు అధ్వానంగా మారాయి. హైవే నిర్మాణాలు పూర్తి చేయడంలో అధికారులు విఫలమయ్యారు. తమ్మరాజుపల్లె, సుగాలి మెట్ట, పాణ్యం సర్వీసు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. 15 ఏళ్లు కావస్తున్నా ఇంతవరకు రహదారులు, డ్రైనేజీల నిర్మాణాలు, మరమ్మతులు పూర్తి చేయలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. డ్రైనేజీల నిర్మాణాలు పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలి. నంద్యాల జిల్లా కేంద్రంలో హైవే అధికారి కార్యాలయం ఏర్పాటు చేయాలి. సుగాలిమెట్ట వద్ద పిన్నాపురానికి వెళ్లే సర్వీసు రహదారిని పూర్తి చేయాలి. అలాగే రెస్ట్ జోన్‌ను పూర్తి చేయాలి. ● కె.భాస్కర్, సీపీఎం మండల నాయకుడు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- యోగా సంఘం జిల్లా చైర్మన్ ఆవుల విజయభాస్కర్ రెడ్డి



యోగాలో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులతో యోగా గురువులు

ఆళ్లగడ్డ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): యోగాను క్రమం తప్పక సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని యోగా అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఆవుల విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆళ్లగడ్డ లోని ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి యోగా హాల్లో జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన సబ్ జూనియర్, సీనియర్ బాలబాలికల యోగా పోటీలను యోగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, యోగా సంఘం జిల్లా కార్యదర్శి హనుమంత్ రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరై ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు సెప్టెంబరు మొదటి వారంలో ద్వారకాతిరుమలలో నిర్వహించను న్న రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్య క్రమంలో వ్యాయామ ఉపధ్యాయులు శ్రీధర్, శ్రీనివాసరెడ్డి, ప్రతాప్, బాబు, మనోహర్‌బాబు, బుచ్చిబాబు బాలస్వామి, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

- రూ.14,600 నగదు స్వాధీనం



మాట్లాడుతున్న సీఐ హనుమంతనాయక్

కొవెలకుంట్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెం దిన పది మంది జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.14600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ హనుమంతనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో కొంతమంది పేకా ట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి సంతమార్కెట్ సమీపంలోని ఓ ఇంటిలో పేకాట ఆడుతున్న పదిమందిని అదుపులోకి తీసుకు న్నామన్నారు. వారి నుంచి రూ.14600 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వర్షం కోసం రంగస్వామికి పూజలు



కలచట్లలో అన్నప్రసాదం తయారు చేస్తున్న గ్రామస్థులు

ప్యాపిలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలచట్ల గ్రామంలో ఆదివారం వర్షం కోసం రంగస్వామికి గ్రామస్థులు పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నప్రసాదం తయారు చేసిన రైతలు స్వామివారికి నైవైద్యం సమర్పించారు. అనంతరం భజనలు, అభిషేకాలు నిర్వహించారు. ఇలా రంగస్వామికి పూజలు నిర్వహిస్తే వర్షాలు బాగా పడి పంటలు పండుతాయని రైతుల నమ్మకం.

బకాయిలు చెల్లించాలి

- పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేఎన్ భానుసింగ్

డోన్ రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం చెల్లించి ఆదుకోవాలని ఆ సంఘం అ ధ్యక్షులు కేఎన్ భానుసింగ్ కోరారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు సుబ్బ రాయుడు, గాలయ్య, గోపాల్, రామదాసురెడ్డి, మౌలాలి, ఆంజనే యులు, చెన్నకేశవులు, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

డోన్‌లో కార్డన్ సెర్చ్




పట్టణంలో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

డోన్ టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పట్టణంలోని చిగురుమానుపేట, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో పోలీసులు అనుమానిత ఇళ్లలో సోదాలు చేశారు. ఎలాంటి డాక్యుమెంట్లు లేని 13 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శరత్ కుమార్‌రెడ్డి, పోలీసులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

డోన్ టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన లారీ డ్రైవర్ షేక్‌నూర్ బాషా (54) శనివారం పేరెంటాలమ్మ గుడి సమీపంలో జరిగిన బైకు ప్రమాదం లో మృతి చెందాడు. ఆయన మృతికి ప్రముఖ న్యాయవాది ఎం.నాగభూషణం రెడ్డి, డోన్ మోటారు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.శివరాం సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం మృతుడి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాగరాజు, మీసాల శ్రీను, రామాంజనేయులు, మద్దిలేటి, మధు, రమణ, తిరు పాలు, మోదీన్, రాజా, మద్దిలేటి, రంగడు, ప్రైవేటు బస్సు వర్క ర్స్ యూనియన్ నాయకులు మహేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేయడం సరికాదు



మాట్లాడుతున్న వీఆర్ లక్ష్మీరెడ్డి

కొలిమిగుండ్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నిరాధారమైన ఆరోపణలు, తప్పుడు ప్రచారం చేయడం సరికాదని టీడీపీ బనగా నపల్లె నియోజకవర్గ కో కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి సూచించారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో పింఛన్ సొమ్ము నొక్కేస్తున్నారంటూ వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. మరోసారి ఇటువంటి తప్పుడు ప్రచారం చేస్తే చట్ట ప్రకారం చర్యలు చేపడ తామని హెచ్చరిం చారు. మంచి ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సహించేదిలేదన్నారు. సమావేశంలో కనకాద్రిపల్లె గ్రామ సర్పంచ్ శివశంకర్, టీడీపీ నాయకులు వెంకటమల్లారెడ్డి, పెద్దిరెడ్డి, ఉపసర్పంచ్ రామలక్ష్మణ్ణ, వెంకటేషు తదితరులు పాల్గొన్నారు.

పొంగిపొర్లాయి..

- ఉప్పొంగిన కల్వటాల వంక
- నిండిన చెరువులు
- జలమయమైన వీధులు
- అనంతపురం జిల్లా సరిహద్దులో తెగిపోయిన రోడ్డు
- ఇబ్బందులుపడ్డ ప్రయాణికులు



శాంతినగర్‌లోని ఓ వీధిలో నిలిచిన వర్షపు నీరు



కోరుమానుపల్లె వద్ద నీట మునిగిన పంట పొలాలు



నిండు కుండలా కొలిమిగుండ్ల సద్దల వెంగన్న చెరువు



చాగలమర్రిలో పొంగి ప్రవహిస్తున్న అడ్డవాగు



ఎన్‌హెచ్-544డిపై భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్

కొలిమిగుండ్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎట్టకేలకు భారీ వర్షం కురిసింది. శని వారం అర్ధరా త్రి నుంచి ఆదివారం ఉద యం వరకు కుండపోతగా వాన కురిసింది. నాలుగేళ్లలో అత్యధిక వర్ష పాతం ఇదేనని మండల వాసులు పేర్కొన్నారు. మండలంలోని ప్రధాన వాగులు, వంకలు ఉప్పొంగా ప్రవహించాయి. సద్దలవెంగన్న చెరువు, తిమ్మనాయిని పేట చెరువు, ద య్యాలచెరువు, చిన్న చెరువు, హను మంతుగుండం చెరువుల్లోకి చాలకాలం తర్వాత వర్షం నీరు చేరడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. కొలిమిగుండ్లలోని శాంతినగర్‌లో పలు వీధులు జలమయమయ్యాయి. ఇళ్ల ముందు పార్క్ చేసిన బైకులు నీట మునిగాయి. వర్షం ఆగిన అనంతరం సుమారు మూడు గంటల పాటు శాంతినగర్ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు రాయల్టీ చెక్‌పోస్టు సమీపంలో అనంతపురం జిల్లా సరిహద్దు ప్రాంతంలో అనంతపూర్-అమరావతి ఎన్‌హెచ్ 544-డి రహదారి కొట్టుకపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపో యాయి. అటు తాడిపత్రి వైపు, ఇటు కొలిమిగుండ్ల వైపు సమారు ఆరు కిలో మీటర్లు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇంకోవైపు జమ్మల మడుగు రహదారిలో కల్వటాల వద్ద వంక ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు స్థంభించిపోయాయి. ఉదయం 8గంటల వరకు బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు నిలిచి పోవడంతో ప్రయాణి కులు కష్టాలు పడ్డారు. కోరుమానుపల్లె, అ బ్బులాపురం, కొలిమిగుండ్ల, కల్వటాల తదితర అనేక గ్రామాల్లోని పంట పొలాల్లో నీరు నిలిచిపోయింది.

చాగలమర్రి: మండలంలో ఆదివారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. 38.8 మీ.మీ వర్షపాతం నమోదైంది. ఆయా గ్రామా ల్లో ఎండుతున్న మొక్కజొన్న, మినుము, కంది, ప సుపు, పెసర పంటలకు కురిసిన వర్షం జీవం పోసింది. 50 రోజుల నుంచి వాన జాడ కనిపిం చకపోవడంతో ఆందోళనలో ఉన్న రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. చాగలమర్రి గ్రామ సమీ పంలోని గోపాయలపల్లె రహదారిలో అడ్డవాగు పొంగి ప్రవహించి రహదారి నీటి కుంటలా మారిం ది. వర్షం కురవడంతో పంట పొలాల్లో నీరు నిలి చింది. ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంట పొలాలకు వర్షపు నీరు జీవం పోసింది.

రుద్రవరం: మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు 32.6 మీ.మీ.గా వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కొండమాయపల్లె సమీపంలో బం గారమ్మవాగు, చిన్నకంబలూరు మెట్ట సమీపంలో, కోడిపిల్లవాగు పొంగి ప్రవహిస్తోంది. పంట పొలాల్లో వర్షం నీరు నిల్వ చేరింది. వరినాట్లు నీటమునిగాయి.

ఉయ్యాలవాడ: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామా ల్లోని వంకలు, వాగులు ఉప్పొంగి ప్రవహిం చాయి. కుందూనదికి భారీగా వర్షం నీరు వచ్చి చేరింది. ఆర్.పాంపల్లె గ్రామ సమీపంలోని కుందరవాగు ఉప్పొంగి ప్రవహించింది. ఇది కొన్ని పంటలకు మేలు చేస్తే మరికొన్ని పంటలకు నష్టం కలిగిస్తుంది. ప్రస్తుతం మండలంలో మినుము పంట కోత దశలో ఉండగా మొక్కజొన్న ఎండు దశలో ఉంది. వరి నాట్లు ఇప్పుడిప్పుడే వేస్తుండగా అవి నీట మునిగి దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రుద్రవరం: కొండమాయపల్లె సమీపంలో పంట పొలాల్లో వర్షం నీరు



ఉయ్యాలవాడ: పొంగి ప్రవహిస్తున్న కుందర వాగు

బండలాగుడు పోటీలతో రైతుల్లో ఉత్తేజం

- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

డోన్ టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రైతులను ఉత్తేజ పరిచేందుకే బండలాగుడు పోటలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గుమ్మకొండ గ్రామంలో శ్రావణమాసంలో ప్రతి ఏటా నిర్వహించే ఆంజనేయస్వామి పండుగ సందర్భంగా రెండు రోజులపాటు బండలాగుడు పోటీలు నిర్వహించారు. చివరి రోజున బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే కోట్ల ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ తెలుగుదేశం పార్టీ రైతుల పక్షపాతి అని పేర్కొన్నారు. రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించే నాయకుడు, ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు అని అన్నారు. ఈ పోటీల్లో మొదటి రెండు విజేతలుగా నంద్యాల జిల్లాకు చెందిన బీఎస్ఎస్ రెడ్డి, రాయవరం రామచంద్రారెడ్డి రూ.40వేలు, ద్వితీయం రూ.30వేలు, మూడో విజేతకు కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన బీఎస్ఎస్ బుల్స్, నాలుగో విజేతగా గద్వాలకు చెందిన వడ్డెమాను అంజిరెడ్డి రూ.10వేలు, 5వ విజేతగా నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలానికి చెందిన మేకల బానుజ రూ.8వేలు, ఆరో విజేతగా నంద్యాల జిల్లా బుక్కమల్ల గ్రామానికి చెందిన ఎన్.చంద్రశేఖర్ రెడ్డి రూ.5వేలను, ఏడో విజేతగా నంద్యాల జిల్లా డోన్ మండలం సీసంగుంతల గ్రామానికి చెందిన కే.రాజు వృషభాలు రూ.5వేలు వృషభాల యజమానులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దశరథరామిరెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ నారాయణ టీడీపీ నాయకులు హరిశంకర్ గౌడు, యోగానందరెడ్డి, చిన్న రంగారెడ్డి, బి.రంగారెడ్డి, హనుమప్ప నాయుడు, సుగాలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



పూజలు చేయడానికి వచ్చిన భవానీ భక్తబృందం సభ్యులు

బనగానపల్లె, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురస్కరించుకొని మండలంలోని పలుకూరు గ్రామంలో దుర్గాభవాని పీఠం గురువు షేక్షావలి ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగ సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని భవాని పీఠం వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జేకే ఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మా నం దాచారి, ధర్మవరం హోహన్, గురువు లక్ష్మీనారాయణాచారి, భవాని భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

కోవెలకుంట్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్ర వర్తనతో మెలగాలని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వ హించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల జడులు గొడవలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా గొడవలకు పాల్పడినా అలజడులు సృష్టించినా చర్యలు త ప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, అల్లర్లు సృష్టించి ప్రజాశాంతికి భంగం కలిగించినా శాఖాపరమైన చర్యలు తప్పవని బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వ హించారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది, ఆయా గ్రామాల రౌడీషీటర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడు మృతి

చాగలమర్రి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుడు ఓబులేసు (42) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఈవో తారకేశ్వరి బాధితకుటుంబాన్ని పరా మర్శించి ఓబు లేసు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిం చారు. బాధిత కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వ సాయం కింద రూ.25 వేలు ఆర్థిక సాయం మృతుడి భార్య సలోమికి అందజేశారు. ఆమె వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ ..

బనగానపల్లె, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని గులాంనబీపేట సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపా రు. వివరాలు.. గ్రామ సమీపంలో రోడ్డుపై వెళ్తున్న ఓ గుర్తు తెలి యని మహిళ(50) ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భారీ వాహనం ఢీకొనడంతో మృతురాలి శరీరం నుజ్జునుజ్జు అయింది. పోలీసులు, ఘటనా స్థలానికి చేరుకొని మహిళ మృతదేహాన్ని బనగానపల్లె ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే కేబుల్ చోరీ

కొలిమిగుండ్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా రైల్వే లైన్‌కు సంబంధించిన కాపర్ కేబుల్ చోరీకి పాల్పడుతున్న ముఠాను కొలిమిగుండ్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని మీర్జాపురం గ్రామానికి చెందిన సుమారు 20 మందికి పైగా వైసీపీ కార్యకర్తలు రెండు ముఠాగా ఏర్పడి చోరీకి పాల్పడుతున్న ఘటన వెలుగు చూసింది. గతంలో రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో పలు దొంగతనాలకు పాల్పడిన వీళ్ల కొద్దిరోజులుగా రైల్వే లైన్‌కు సంబంధించిన విలువైన హైటెన్షన్ కాపర్ కేబుల్‌ను ఎ త్తుకెళుతున్నారు. దీంతో సంబంధిత అధికారుల ఫిర్యాదుతో నిఘా పె ట్టిన పోలీసులకు శనివారం రాత్రి సదరు ముఠాలోని పలువురు స భ్యులు చోరీకి పాల్పడుతూ పట్టుబడ్డారు. వీరి నుంచి సుమారు రూ.3లక్షలకు పైగా విలువైన కేబుల్, వారు వినియోగించిన వాహ నాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. నిందితు లంతా మండలానికి చెందిన ఓకీలక వైసీపీ నాయకుడి అనుచరులు కావడం గమనార్హం.

వక్కిలేరులో 10 కిలోల చేప



చేపను చూపుతున్న యువకుడు

చాగలమర్రి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కూలూరు రహదారిలో ఈత కోసం వెళ్లిన యువకులకు ఆదివారం పది కేజీల బరువుగల పెద్ద చేప పట్టుబడింది. మాబుహుసేన్, మరికొంత మంది యువకు లు వక్కిలేరు నీటిలో ఈత కొడుతుం డగా బరువుగల చేప పట్టుబడింది. సాధారణంగా ఇంత బరువుగల చేప పట్టుబడటం ఎన్నడూ చూడలేదని, పట్టుబడ్డ చేపను చూపిస్తూ యువకు లు ఆనందం వ్యక్తం చేశారు. ఆ దారి వెంట వెళ్లే పాదచారులు చేపను చూసి ఆశ్చర్యపోయారు.

అధికారులు రాకపోతే ఎలా?

- మండల సమావేశంలో ఎంపీపీ వీరభద్రుడు



మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు

చాగలమర్రి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశాలకు అధికారులు రాకపోతే ఎలా అని ఎంపీపీ వీరభద్రుడు ప్రశ్నించారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అధికారులు హాజరైతే సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానం లభిస్తుందని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎంపీటీసీలకు గౌరవ వేతనం ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గైర్హాజరు కావడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. విద్యుత్ సమస్య పరిష్కరించాలని ఎంపీటీసీలు నరసింహుడు, లక్ష్మీరెడ్డి, సర్పంచ్ దస్తగిరిరెడ్డిలు విద్యుత్ శాఖ ఏఈ రమణయ్యను కోరారు. మినుము కిట్లు మంజూరైన వ్యవసాయశాఖ సక్రమంగా పంపిణీ చేయలేదని డి.వనిపెంట సర్పంచ్ బాలీశ్వర్‌రెడ్డి ఆరోపించారు. వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గ్రామాలలో పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు ఆశీర్వాదమ్మ, ముల్లారఫీ, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంఈవో అనూరాధ, డిప్యూటీ ఎంపీడీవో తాహిర్‌హుసేన్, ఏఈలు కొండారెడ్డి, రమణయ్య, నవీన్, పశువైద్యాధికారి సాయిబాబా, ఏపీవో ఖాసీం, ఈవో తారకేశ్వరి, ఏపీఎం నాగమ్మ, ఏఈవోలు రేవతి, రాఘవ కుమారి, సూపర్‌వైజర్లు రామలింగారెడ్డి, రషిదాబేగం, హాస్టల్ వార్డెన్‌లు హరిత, ఖాసీంవలి, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

బేతంచెర్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో 2003-04 ఏడాదిలో పదో తరగతి బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం జరుపు కున్నారు. సమావేశానికి పూర్వ ఉపాధ్యాయులు ఆదినారాయణ, వెంకట్రావు, వెంకటరెడ్డి, కృష్ణమోహన్, సురేంద్రనాథ్ రెడ్డి, కుమారి, రత్నమ్మ, మధుమోహన్, హజరత్, తిరుపాల్, సుశీలమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు ఒకరితో ఒకరు పంచుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న స్నేహితులకు కొంత సొమ్ము పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పాస్‌బుక్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం గురువులను సన్మానం చేసి వారి దీవెనలు తీసుకున్నారు.

సింగిల్ విండో చైర్మన్ల నియామకం



నాగేశ్వరరావు యాదవ్



సీమ సుధాకర్‌రెడ్డి

ప్యాపిలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెండు సింగిల్ విండో స్థానాలకు చైర్మన్లు నియ మితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అం దినట్లు సంబంధిత అధికారుల వెల్లడించారు. ప్యాపిలి సింగిల్ విండో చైర్మన్‌గా వై నాగేశ్వరరావు నియమితు లు కాగా, సభ్యులుగా సి సుజాత, సి రవీంద్ర నియ మితులయ్యారు. అలాగే హుసేనాపురం సింగిల్ విండో చైర్మన్‌గా సీమ సుధాకర్‌రెడ్డి, సభ్యులుగా సుంకన్న, భాస్కర్‌లను నియమించింది. గతంలో మూడు సార్లు హుసేనాపురం సొసైటీ చైర్మన్‌గా పనిచేసిన సీమ సుధాకర్‌రెడ్డి నాలుగవ సారి కూడా నియమితుల య్యారు. అలాగే డీసీఎంఎస్ చైర్మన్‌గా ఉన్న వై నాగేశ్వరరావుయాదవ్ ప్యాపిలి సింగిల్‌విండో చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. తమను సింగిల్‌విండో చైర్మన్లుగా నియమించడంపై వారు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబుకు, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూ ర్యప్రకాశ్‌రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన బాధ్య తలను సమర్థవంతగా నిర్వహిస్తామన్నారు. రైతులకు

విజ్ఞాన మేళాను విజయవంతం చేయాలి

బేతంచెర్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సరస్వతి విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 13న ఉమ్మడి జిల్లా విజ్ఞాన మేళాను విజయ వంతం చేయాలని పాఠశాల అధ్యక్షుడు గౌరి హుశేన్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సరస్వతి శిశు మందిర్ మాధ్యమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు అలివేలమ్మ అధ్యక్షతన పాఠశాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీ య స్థాయిలో విద్యాభారతి రాష్ట్ర స్థాయిలో సరస్వతి విద్యాపీఠం ఆధ్వర్యంలో నడుపబ డుచున్న సరస్వతి ఇంగ్లిషు మీడియం శిశు మందిరాలలో విద్యతో పాటు విద్యార్థులకు, శారీరక, మానసిక, రంగస్థల విజ్ఞానపరం గా నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ఈ నెల 13న బుధవారం బేతంచెర్లలో నిర్వహించనున్న విజ్ఞానమేళాకు ఉమ్మడి జిల్లాలోని 17 పాఠశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు హాజరై సైన్స్, గణితం లందు తమ ప్రదర్శనలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు పుల్లారెడ్డి, జశ్వంత్‌రెడ్డి, దివ్య, శ్రీదేవి, శ్యాంబాబు, రామదాసు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి సన్నిధిలో న్యాయాధికారి దంపతులు

బేతంచెర్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి, మహాలక్ష్మి అమ్మవార్లను కర్నూలు న్యాయాధికారి స్పెషల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి సుదర్శి అనిల్ కుమార్, సతీమణి స్పెషల్ జుడిషియల్ మేజిస్ట్రేట్ మొబైల్ కోర్టు న్యాయాధికారి సుదర్శి అనూష ఆదివారం దర్శించుకున్నారు. ఈవో రామాంజనేయులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కుటుంబ సమేతంగా స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అంద జేసి వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు ఇచ్చారు.